క్లుప్తంగా

మూడు టిప్పర్ల పట్టివేత



ఐనవోలు : అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొండపర్తి శివారు పెద్దమ్మ గుడి సమీపంలో ప్రభుత్వ భూమి నుంచి మొరం తవ్వకాలు చేస్తూ టిప్పర్లలో తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో మూడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. వాహన యజమాని, డ్రైవర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

మండల కమిటీ ఎన్నిక



ఐనవోలు : ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగవీటి అశోక్ ఆధ్వర్యంలో ఐనవోలు ఆర్యవైశ్య మహాసభ మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఐనవోలు గ్రామానికి చెందిన అడ్డగూడి సతీశ్‌కుమార్, కార్యదర్శిగా కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన పబ్బతి సత్యనారాయణ, కోశాధికారిగా కొండపర్తి గ్రామానికి చెందిన ఎన్నంపెల్లి ఈశ్వర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి వంగవీటి అశోక్, జిల్లా అధ్యక్షుడు దొడ్డ మోహన్‌రావు, సంఘం సీనియర్ నాయకులు శ్రీనివాస్, కృష్ణమూర్తి, కృష్ణమూర్తి, మునేందర్, పవన్‌కుమార్, సత్యనారాయణ, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నియామకం



ఎల్కతుర్తి : బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని దామెర గ్రామానికి చెందిన మంతుర్తి శ్రీకాంత్‌యాదవ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బట్టి శ్యామ్‌యాదవ్ శనివారం ప్రకటనలో తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వేలేరు : మండలంలోని శాలపల్లి గ్రామానికి చెందిన దామెర అనిల్ ఇటీవల పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 50 కేజీల బియ్యం అందించారు. రాహుల్, చింటు తదితరులు ఉన్నారు.

నేడు బీపీ మండల్ జయంతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బీసీ సెల్, మహాత్మా జ్యోతిరావు పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న బీపీ మండల్ జయంతిని నిర్వహించనున్నట్లు సెంటర్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులు విద్యతోపాటు వృత్తి నైపుణ్యాలను కూడా పెంపొందించుకోవాలని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి సూచించారు. కేంద్ర ప్రభుత్వ వృత్తి నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వ శాఖ సఫల్ స్కీంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని కళాశాలలో శనివారం నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ రెహమాన్, రిసోర్స్ పర్సన్లు పూర్ణ శశికాంత్, డాక్టర్ ఎల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

హనుమకొండ పీఎస్ తనిఖీ

వరంగల్ క్రైం: వార్షిక తనిఖీల్లో భాగంగా హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా శనివారం సందర్శించి తనిఖీ నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలతో పాటు స్టేషన్‌లో నమోదైన కేసులు, వాటి రికార్డులను పరిశీలించారు. ముఖ్యమైన కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇన్‌స్పెక్టర్ సతీష్, సబ్ ఇన్‌స్పెక్టర్లు అశోక్, సతీష్, పరశురాములు, సిబ్బంది పాల్గొన్నారు.

తొలగని కంకర కష్టాలు

- ఏడాదిగా నిలిచిపోయిన నిర్మాణ పనులు
- బిల్లులు రాక ముఖం చాటేసిన కాంట్రాక్టర్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



వేములపల్లి నుంచి కన్నారం వెళ్లే దారిలో కంకర పోసి వదిలేసిన రోడ్డు

వేలేరు : ఏళ్ల తరబడి నుంచిఉన్న రోడ్డు సమస్య నేటితో తొలగిపోనుందని ఆయా గ్రామాల ప్రజల సంతోషం మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఏడాది క్రితమే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినా సదరు కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదనే కారణంతో పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కంకర పోసిన రోడ్లపై నడవలేక, వాహనాలపై వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండలంలోని కన్నారం గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం, బస్సు సౌకర్యం లేకపోవడంతో కాలినడకనే శరణ్యమంటున్నారు. అయితే కన్నారం గ్రామం గతంలో కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఉండేది. జిల్లాలు, మండలాల పునర్విభజన తర్వాత హనుమకొండ జిల్లా వేలేరు మండలంలోకి చేరింది. దీంతో పాటు కన్నారం హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఉంటే.. మండలం వేలేరు కావడంతో అటు హుస్నాబాద్ ఎమ్మెల్యే, ఇటు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. దీంతో మండలంలో ఏ సమస్య వచ్చిన తీరడం ఇబ్బందిగా మారిందని అంటున్నారు. కాగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.4కోట్ల 35 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించింది. పనులు మొదలు పెట్టి కంకరపోసిన కాంట్రాక్టర్.. బిల్లులు రావడం లేదని పనులను మధ్యలోనే వదిలేశాడు. దీంతో గ్రామం నుంచి మండలానికి, వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే గ్రామస్తులు, ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. అలాగే గతంలో ఐటీడీఏ నిధుల నుంచి గ్రామాలకు, తండాలకు లింక్ రోడ్ల నిర్మాణం కోసం రూ.12 కోట్లు కేటాయించారు. వేలేరు తహసీల్దార్ కార్యాలయం నుంచి బంగ్లాపల్లి వరకు, లక్ష్మీతండా నుంచి కస్తూర్బా గాంధీ పాఠశాల వరకు, పీచర అంబేడ్కర్ సెంటర్ నుంచి లోక్యతండా, వేపలగడ్డతండా వయా వేలేరు వరకు, పీచర సమ్మక్క ఆలయం నుంచి మిరుపకుంటతండా వయా లోక్యతండా వరకు, అలాగే మాటుతండా నుంచి ఎర్రబెల్లి వరకు పనులు మొదలు పెట్టిన కాంట్రాక్టర్లు కంకరపోసి వదిలేశారు. దీంతో ద్విచక్ర వాహనదారులు స్కిడ్ అయి పడిపోతున్నారని, కొన్ని సందర్భాల్లో తీవ్ర గాయాలపాలవుతున్నారని వాహనదారులు ఆగ్రహిస్తున్నారు. ఈ రోడ్లపై వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం..

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రోడ్డు మొత్తం ఒకేసారి కంకరపోసి బీటీ పనులు చేపట్టకపోవడంతో కంకర్లపై వెళ్లే వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కొన్ని నెలల క్రితం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినా ఫలితం లేకుండా పోయ్యిందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రత్యేక చొరవచూపి రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు.

ఇంకెన్నాళ్లు ఈ రోడ్డు కష్టాలు

గతంలో మా గ్రామానికి మట్టిరోడ్డు ఉండేది. బీటీ రోడ్డు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు పనులు ప్రారంభించి కంకర పోసే సరికి చాలా సంతోషపడ్డాం. కానీ ఏడాది కాలంగా పోసిన కంకర అలాగే ఉంది. కంకర్లపై ప్రయాణించాలంటే భయం వేస్తోంది. బైక్‌పై వెళ్లేవారు కిందపడి గాయాల పాలవుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి.

- వేముల ప్రసాద్, కన్నారం

సంస్కృతం ఉచ్ఛరణతో మేధాశక్తి మెరుగు



వేడుకల్లో కళాశాల లెక్చరర్లు, విద్యార్థినులు

హన్మకొండ అర్బన్: బీజాక్షరాలతో కూడిన సంస్కృత భాష ఉచ్ఛరించడం, రాయడం ద్వారా మానసికంగా మేధాశక్తి మెరుగవుతుందని సంస్కృత లెక్చరర్ శ్రీవిద్య అన్నారు. విశ్వ సంస్కృత భాషా దినోత్సవం సందర్భంగా నగరంలోని వడ్డేపల్లి పింగిళి మహిళా జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీవిద్య మాట్లాడుతూ సంస్కృతం అంటే కేవలం భాష మాత్రమే కాదని, ఆయుర్వేద, సామాన్య, నీతి శాస్త్రాలతో పాటు తదితర శాస్త్రాలకు మూలాలైన గ్రంథాలు సంస్కృత భాషలోనే మొట్టమొదటగా లభించినట్లు ఆధారాలు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు సంస్కృత భాషా ప్రాధాన్యతను వివరిస్తూ చేసిన ఆట, పాటలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు కవిత, కళాశాల లెక్చరర్లు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ముట్టుకుంటే ప్రమాదమే..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి శివారు ప్రాంతంలో గల ముల్కనూరు రహదారి పక్కన ఓ రైతుకు చెందిన వ్యవసాయ బావి వద్ద విద్యుత్ పోల్‌కుఉన్న సపోర్టు వైరుకు తీగజాతి చెట్టు కొమ్మలు అల్లుకున్నాయి. దీంతో వర్షం కురిసినప్పుడు చుట్టుపక్కల ప్రాంతంలో ఎర్త్ వస్తుంది. సంబంధిత అధికారులు స్పందించి తీగజాతి చెట్టును తొలగించాలని రైతులు, కూలీలు కోరారు. ప్రమాదం జరుగక ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
లక్ష్మణ్‌నాయక్, విద్యుత్‌శాఖ ఏఈ ,ముల్కనూరు
ఫోన్‌నంబర్ : 9440811458

ఆయుర్వేదంతో దీర్ఘకాలిక వ్యాధులు నయం



మాట్లాడుతున్న కార్పొరేటర్ నరేంద్రకుమార్

కాశిబుగ్గ: ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్ అసోసియేషన్ వరంగల్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధనాస్పత్రి సహకారంతో కాశిబుగ్గ కేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. వైద్యులు హరికిషన్, వసంత, శ్వేత, జ్యోతి, కమలకుమారి, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు మల్లారెడ్డి, సదానందం, గోవర్ధన్, నరసింహ, రాజేంద్రప్రసాద్, రాజమౌళి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



దామెర : కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు



ఐనవోలు : ఉట్టి కొడుతున్న విద్యార్థి



ఎల్కతుర్తి : ఎస్సార్కే పాఠశాలలో..



ఆత్మకూరు : కృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు



పరకాల : బిట్స్ పాఠశాలలో..



శాయంపేటలో..

దామెర : మండల కేంద్రంలోని ఏకశిలా ప్రైమ్ పాఠశాలలో శనివారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేశాధారణతో అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు జరీన, జ్యోత్స్న, సుమాంజలి, మౌనిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : మండల కేంద్రంలోని ఆల్ఫీట్యూడ్ పాఠశాలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకను ముందస్తుగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడి, విద్యార్థినులు గోపికలు వేషధారణతో అలరించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాయంపేటలో..

శాయంపేట : ప్రగతిసింగారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులు కృష్ణుని, గోపికల వేషధారణలో అలరించారు.

పరకాలలో..

హన్మకొండ (పరకాల) : శ్రీకృష్ణాష్టమి వేడుకలను పరకాలలో పట్టణంలోని ప్రైవేటు విద్యా సంస్థలలో శనివారం ముందస్తుగా ఘనంగా నిర్వహించుకున్నారు. బిట్స్, చైతన్య హైటెక్ స్కూల్‌లో వేడుకలు జరుగగా కృష్ణుడు, గోపికల వేషధారణలతో విద్యార్థిని, విద్యార్థులు ఆకట్టున్నారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని స్పెక్ట్రా హైస్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. విద్యార్థులు కృష్ణుడి, గోపికల అలంకరణలో అలరించారు. ఉట్టికొట్టి ఉత్సాహంగా గడిపారు. ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తిలో..

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ఎస్సార్కే పాఠశాలలో శనివారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. అధ్యాపక బృందం కవిత, ఉమామహేశ్వరి, అభి, భీమేశ్వరి, అస్మా, అమూల్య, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌తో పాటు హైటెక్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. చిన్నారులు రాధాకృష్ణ, శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఆయా పాఠశాలల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టి కొట్టారు. ప్రిన్సిపాల్ చల్లూరి ప్రభాకర్, హెచ్‌ఎం శ్రీధర్, డైరెక్టర్లు రాము, మధు, కిశోర్, అనిల్, ఉపాధ్యాయులు ఖాజావిఠయా, సురేందర్, అరుణ, భవాని, సుజాత, మానస, రజిత, స్రవంతి, దివ్య, ప్రవళిక, పద్మ, నిహారిక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని ఒంటిమామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గోపికా, కృష్ణుడి వేషధారణలో అలరించారు. అదే విధంగా ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులు ఉట్టికొట్టి సంబురాలను చేసుకున్నారు. వేడుకల్లో విజేతలుగా నిలిచిన వారికి హెచ్‌ఎం ప్రతాపరత్నకుమార్ బహుమతులు అందించారు.

అనాథ విద్యార్థిని అక్కున చేర్చుకున్న 'ఎంజేపీ'

- 8వ తరగతిలో ప్రవేశం కల్పించిన గురుకుల పాఠశాల కార్యదర్శి సైదులు



అశ్రిత్‌కు అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవీందర్

కమలాపూర్ : తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన హనుమకొండ జిల్లా కమలాపూర్‌కు చెందిన మేడిపెల్లి అశ్రిత్‌కు స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల అక్కున చేర్చుకుంది. మండల కేంద్రానికి చెందిన మేడిపెల్లి నరేష్‌గౌడ్-లలిత దంపతులు మృతిచెందిన విషయం తెలిసిందే. వారి ఇద్దరు పిల్లలు రుత్విక్, అశ్రిత్ అనాథలుగా మారారన్న విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని చలించిపోయిన ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, స్వేరోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు శనిగరపు రాజేంద్రప్రసాద్ వాట్సాప్ ద్వారా ఎంజేపీ గురుకుల పాఠశాలల కార్యదర్శి డాక్టర్ సైదులు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన పిల్లలకు అండగా తానున్నానంటూ ముందుకొచ్చారు. వారికి చదువుకునే అవకాశం కల్పిస్తామని కమలాపూర్‌లోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా అశ్రిత్‌ను శనివారం ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతిలో చేర్పించారు. శ్రీధర్, మహేష్, రవి, సంతోష్, సారయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఉచిత హోమియోపతి వైద్యశిబిరం



ముల్కనూరులో హోమియోపతి ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని ముదిరాజ్ కాలనీలో హోమియోపతి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సరిత ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మధుమోహం, రక్తపోటు, మోకాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, అజీర్తి, కడుపులో మంట, మలబద్ధకం, అర్షమొలలు, దగ్గు, దమ్ము, స్త్రీ సంబంధిత, మూత్ర సంబంధిత వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించినట్లు తెలిపారు. అలాగే వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కల్పించి, జ్వర పీడితుల సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఇళ్ల పరిశర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి సిబ్బంది రమేశ్, శ్రీనివాస్, పుతిలి పాల్గొన్నారు.

ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత తప్పనిసరి



ఇంకుడుగుంత నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఏపీఓ శారద

దామెర : ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత తప్పకుండా ఉండాలని ఏపీఓ శారద అన్నారు. మండలంలోని వెంకటాపూర్, సింగరాపల్లి, ల్యాదెళ్ల గ్రామాల్లో శనివారం ఇంకుడుగుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 25 ఇంకుడు గుంతలు మంజూరు అయ్యాయని అన్నారు. ప్రతి గుంతకు రూ.6000 ప్రభుత్వం ఇస్తుందని అన్నారు. ఇంకుడు గుంత నిర్మించుకునే లబ్ధిదారులు ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం, ఈజీఎస్ జాబ్‌కార్డు జిరాక్స్‌లతో పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఇంకుడుగుంతను నిర్మించుకుని భూగర్భ జలాలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కారోబార్లు పాల్గొన్నారు.

విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి



విద్యార్థులతో ఫాదర్ కిరణ్

వేలేరు : విద్యార్థులు సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలని మండల కేంద్రంలోని సెయింట్ ఫ్రాన్సిస్ పాఠశాల ఫాదర్ కిరణ్ అన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా శనివారం ఘనంగా నిర్వహించారు. ఫాదర్ కిరణ్ మాట్లాడుతూ.. చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తోన్న కాంగ్రెస్



మాట్లాడుతున్న ప్రసాద్

శాయంపేట : రాష్ట్రంలోని రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని మైలారం గ్రామ మాజీ సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్ ఆరోపించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని రైతుల కోసం సాగునీరు, ఉచిత కరెంట్, రైతుబంధు, రైతుబీమా అందించిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా అన్యాయం చేస్తోందని ఆరోపించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు భూపాలపల్లి నియోజకవర్గానికి, శాయంపేట మండలానికి ఒరగబెట్టింది ఏమీ లేదని విమర్శించారు. శాయంపేట మండలానికి అంబులెన్స్ మంజూరు చేసినట్లు ప్రచారం చేశారే తప్పా ఇప్పటికీ అందుబాటులోకి తీసుకురాలేదని అన్నారు. మండలంలో చాలా మంది రైతులకు ఇప్పటికీ రుణమాఫీ కాలేదని తెలిపారు. బహిరంగ చర్చకు సవాల్ విసిరిన కాంగ్రెస్ నాయకులు ఎందుకు రాలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ, భారత జాగృతి రాష్ట్ర నాయకుడు అమ్మ అశోక్, నాయకులు అరికిళ్ల వెంకట్, రమేశ్ పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న దేవునూరి రమ్యకృష్ణ

హన్మకొండ (పరకాల): పరకాల పట్టణంలోని 4వ వార్డులో సగర వీధిలో రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని 4వ వార్డు కౌన్సిలర్ దేవునూరి రమ్యకృష్ణ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ప్రజల సౌకర్యార్థం రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన వారిని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, తాను ఖచ్చితంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వినతిపత్రం అందించిన బీజేపీ కౌన్సిలర్

పరకాల పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల ఇవ్వాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని బీజేపీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి వినతిపత్రం అందించారు. కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యేను కలిసి దామెర చెరువు మత్తడి నిర్మాణ పనులు వేగవంతం చేయడంతో పాటు శ్రీనివాసాకాలనీలో నిర్మిస్తున్న కల్వర్టు ఎత్తును తగ్గించాలని కోరారు. పట్టణంలో అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కోరారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. వృత్తివిద్య కోర్సు శిక్షకురాలు శిరీష ఆధ్వర్యంలో కొత్తవాడలోని చేనేత వస్త్ర పరిశ్రమ, శతరంజిల ఉత్పత్తులను శనివారం పరిశీలించారు.